# పరాయి సిరా

అనువాద కథలు

## స్వేచ్ఛానువాదం–మల్లాది వెంకట కృష్ణమూర్తి



### చిన్నమాట

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజిలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో ఆ950-ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

# ఆకుపచ్చ రంగు కార్పెట్

*- రాబర్ట్ మేక్‌నియర్ కథకి స్వేచ్ఛానువాదం*

**మిసెస్ జార్గ్** ది గోల్డ్ కోస్ట్ టవర్స్‌లో పన్నెండో అంతస్థులో తన భర్త జార్జ్‌తో నివశిస్తోంది. ఆ రోజు ఆవిడ ఇద్దరు వ్యక్తులు మిసెస్ స్టాన్లీ అపార్ట్‌మెంట్‌లోంచి చుట్టచుట్టిన కార్పెట్స్ బయటకి మోసుకురావడం చూసింది వాళ్ళ యూనిఫాం మీద అక్మే కార్పెట్ క్లీనర్స్ అని రాసి ఉండటంతో వాళ్ళు ఆ కార్పెట్స్‌ని శుభ్రం చేయడానికి తీసుకెళ్తున్నారని అనుకుంది. ఆమె వాళ్ళని అడిగింది.

"మా ఇంట్లోని కార్పెట్స్ శుభ్రం చేసి చాలాకాలమైంది. వీటితోపాటు మావీ తీసుకెళ్ళి శుభ్రం చేసి తెస్తారా?"

వాళ్ళు అంగీకరించి, రసీదు రాసిచ్చి మిసెస్ జార్గ్ కార్పెట్లని కూడా తీసుకెళ్ళారు.

కొన్ని వారాలు గడిచాక మిసెస్ జార్జ్ వాళ్ళకి ఫోన్ చేయడానికి చూస్తే వాళ్ళిచ్చిన రసీదు కనిపించలేదు. టెలిఫోన్ డైరెక్టరీలో ఆ కంపెనీ పేరు లేదు. దాంతో ఆవిడ ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌కి వెళ్ళిన మిసెస్ స్టాన్లీకి ఫోన్ చేసి కార్పెట్ క్లీనర్ ఫోన్ నంబర్ అడిగింది. ఆవిడకి మిసెస్ జార్జ్ అడిగేది వెంటనే అర్థం కాలేదు.

"నేను మా అపార్ట్‌మెంట్ నించి ఇక్కడికి వచ్చి నాలుగు వారాలైంది. మా ఇంట్లోని కార్పెట్లని శుభ్రం చేయమని నేను ఎవరికీ ఇవ్వలేదు" మిసెస్ స్టాన్లీ చెప్పింది.

"కాని వాటిని వాళ్ళు మీ ఇంట్లోంచి తీసుకెళ్ళడం చూసాను?"

మరికొద్దిసేపు మాట్లాడాక మిసెస్ జార్జ్ ఈసారి పోలీసులకి కార్పెట్ దొంగల గురించి చెప్పడానికి ఫోన్ చేసింది.

వాళ్ళిద్దరూ ఖరీదైన ఆ కార్పెట్లని ఇన్సూర్ చేసారు. ఈజిప్ట్ నించి దిగుమతి చేసుకున్న వాటి ఖరీదు ఒకోదానికి అరవైవేల డాలర్లు. నాలుగు కార్పెట్లకి కలిపి రెండు లక్షల నలభై వేలు ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లించాలి. మిసెస్ జార్జ్ క్లెయిమ్ తమకి అందగానే ఆ కంపెనీ ఆ సొమ్ముని చెల్లించే ముందు, తమ డిటెక్టివ్ హెన్రీని ఆ దొంగలని పట్టుకోగలడేమో చూడమని కోరారు.

దొంగలు అంత ఖరీదైన కార్పెట్లని బాహాటంగా మార్కెట్లో అమ్మలేరని హెన్రీకి తెలుసు. తాకట్టు పెట్టాలన్నా, ఒకోదాని ఖరీదు ఐదు వేల డాలర్లకి మించింది కాబట్టి వ్యారస్థులు వాటిని కొన్న బిల్స్‌ని అడుగుతారు. హెన్రీ మిస్సింగ్ ప్రాపర్టీగా వాటి ఫోటోలని మ్యూజియాలకి, ఆర్ట్ డీలర్స్‌కి సరుక్యులర్ పంపాడు. వాటిని తయారు చేసిన ప్రాంతాల పేర్లతోనే ఆ కార్పెట్లని అమ్ముతారు. అవి బజార్, అఫ్షరీ, బెలూచిస్థాన్, జోషాఘన్ కార్పెట్లు.

అతను వాటి యజమానురాళ్ళని ప్రశ్నించడానికి వారి ఇళ్ళకి వెళ్ళాడు. ముందుగా మిసెస్ జార్జ్ ఇంటికి వెళ్ళాడు. ఆవిడ భర్త జార్జ్ తలుపు తెరిచాడు.

"నేను అత్యంత మూర్ఖురాలిని. ఆలోచించకుండా దొంగలని పిలిచి స్వయంగా నా సొత్తుని వాళ్ళకి అప్పగించాను." అతని భార్య నొచ్చుకుంది.

"నాకు డబ్బు కన్నా ఆ కార్పెట్లు ముఖ్యం. అవన్నీ వందేళ్ళ క్రితం అల్లినవి కాబట్టి అంత ధర పెట్టి కొన్నాను. దయచేసి వాటిని వెతికి తెచ్చిస్తే సంతోషిస్తాను" జార్జ్ కోరాడు.

ఆ కార్పెట్ల రంగులు, డిజైన్ల గురించి అడిగి తెలుసుకున్నాక హెన్రీ మిసెస్ స్టాన్లీ అపార్ట్‌మెంట్‌కి వెళ్ళాడు. ఆవిడ ధోరణిని బట్టి  ఆవిడకి, న్యూక్లియర్ ఆయుధాలు తీసుకెళ్ళే జెట్‌కి తేడా లేదని హెన్రీకి అనిపించింది. తన ఇంటి గోడల మీద అలంకారంగా ఆ కార్పెట్లు వేలాడదీసిన ప్రదేశాలని ఆవిడ హెన్రీకి చూపించింది. ఆ ప్రదేశాల్లో గోడరంగు ముదురుగా ఉండి, చుట్టుపక్కల రంగు వెలిసిపోయి ఉండటం అతను గమనించాడు. లైబ్రరీలోని గోడని చూపించి ఆవిడ చెప్పింది.

"అది నాకు బాగా ఇష్టమైన కార్పెట్. మా వారిని చంపిన కార్పెట్ అది."

"మీ వార్ని చంపిందా?" హెన్రీ ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. ఏడాది క్రితం అది స్టాన్లీ మీద పడింది. దాంతో దానికింద ఊపిరాడక మరణించాడు. ఆయనకి కార్పట్లంటే ఇష్టం కాబట్టి అది ఆయనకి మంచి చావు. దానిమీది ఆకుపచ్చరంగుని చుస్తూంటే ఎంతో ఆహ్లాదంగా ఉండేది. ఆయన 1889 తర్వాత అల్లిన కార్పెట్లని కొననిచ్చేవారు కారు. ఆ తర్వాత వాళ్ళు కార్పెట్‌లో సింథటిక్ దారాలని వాడటం ఆరంభించారట."

ఆవిడ గోడల నించి మాయమైన కార్పెట్ల గురించి వివరిస్తూంటే హెన్రీ రికార్డ్ చేసుకున్నాడు.

"ఈ టు రగ్స్, డెర్మిడ్జీ. ఆ రెండు టర్కీలో కొన్నవి. ఇక్కడిది బాకులో కొన్నది. ఇక్కడిది లేయర్ కార్పెట్. పర్షియాలోని ఫెరాఘన్‌కి చెందింది. నాకు డబ్బొద్దు. దయచేసి ఆ కార్పెట్లనే సంపాదించండి" మిసెస్ స్టాన్లీ అర్థించింది.

"మీరు ఎనిమిది కార్పెట్ల గురించి చెప్పారు. లైబ్రరీలోని తొమ్మిదో కారెప్ట్ గురించి చెప్పలేదా?" హెన్రీ అడిగాడు.

"దాన్ని నేను ఇన్సూర్ చేయలేదు కాబట్టి చెప్పలేదు. గుడ్ బై మిస్టర్ హెన్రీ. ఈ సారి శుభవార్తతో కలవండి."

హెన్రీ ఆ తొమ్మిదో కార్పెట్ గురించి ఆలోచించాడు. ఇన్సూర్ చేయని కార్పెట్ విలువ ముప్పై వేల డాలర్లు. ఓ కార్పెట్‌ని ఇన్సూర్ చేయాలంటే ఏజెంట్ ముందుగా దాన్ని నిశితంగా పరిశీలించాలి. అది గతంలో దొంగిలించబడ్డా, లేదా దాని మీద రక్తపు మరకలున్నా.

హెన్రీ ఆసక్తిగల మనిషి. ఆ తొమ్మిదో కార్పెట్ మీదే అతని దృష్టంతా. మిస్టర్ స్టాన్లీని చంపిన, ఇన్సూర్ చేయబడని కార్పెట్ మీద.

షికాగోలో ఎడ్గర్ మేనమామ రస్సెల్ వ్యాపారం పాత కళాఖండాలు అమ్మడం. షికాగోలోని దొంగల్లో తాము దొంగిలించిన యాంటిక్ కళాఖండాలని రస్సెల్‌కి అమ్మనివారే లేరు. కెమేరాలు, టైప్ రైటర్లు, గ్రామఫోన్‌లు, గ్రామఫోన్ రికార్డులు, నాణాలు, స్టాంప్స్, కార్పెట్లు అతని దుకాణంలో దొరుకుతాయి. గోల్డ్ కోస్ట్ టవర్స్ నించి కార్పెట్లని దొంగిలించిన దొంగలు దొంగిలించిన మూడోరోజు అతనికి అమ్మడానికి ఆ కార్పెట్లని తెచ్చినప్పుడు మిసెస్ జార్జ్ తమని చూసి, తమ నాలుగు కార్పెట్లని కూడా అమాయకంగా ఎలా ఇచ్చిందో చెప్పుకుని నవ్వుకున్నారు.

ఎడ్గర్ అవి విలువైనవని తేలిగ్గా పసికట్టాడు. ఇంకా అప్పటికి ఆ దొంగతనాల గురించి ఫిర్యాదు వెళ్ళలేదు. రస్సెల్ వాటిని అమెరికాలో అమ్మదల్చుకోలేదు. పోలీసులు వాటి కోసం దేశమంతటా ఓ కన్నేసి ఉంచుతారని అతనికి తెలుసు. యూరప్‌కి పంపి అక్కడ వాటిని అమ్మాలని కొనేప్పుడే నిర్ణయించుకున్నాడు. అమెరికాలో కన్నా యూరప్‌లో ధర కొంచె తక్కువే అయినా భద్రత ఉంటుంది.

ఎడ్గర్ 1910లో జాన్ కింబర్లీ రాసిన ఓరియెంటల్ కార్పెట్స్ అండ్ రగ్స్ అనే పుస్తకం తెరచి చదువుతూ ఆ కార్పెట్లకి వాడిన రంగులని డిజైన్లని, ముళ్ళని, పేట్రన్‌లని, చిహ్నాలని పరిశిలించాక అవి నకిలీవి కావని తెలుసుకున్నాడు. వాటిలోని ఐదు ఆ శతాబ్దకాలంలో అమ్మినవే. నేలమీద పరిచి, వాడినలాంటి విలువ తక్కువైన కార్పెట్లు కావవి. తొమ్మిది కార్పెట్లు కనీసం నూట ఏభై ఏళ్ళ క్రితంవి.

పన్నెండు అడుగుల ఆరంగుళాలు బై ఇరవై రెండడుగుల నాలుగు అంగుళాల కొలతలు గల అవన్నీ పెద్ద కార్పెట్లు. వాటిలోని తొమ్మిదో రగ్గు ఎడ్గర్‌ని అధికంగా ఆకర్షించింది. మిగిలినవాటి ఆకుపచ్చరంగు కన్నా దాని రంగు ముదురుగా ఉండి మెరుస్తోంది. మధ్యలో ఓ పూల డిజైన్ ఉంది. అది టర్కీనించి ఉత్తర పర్షియాకి తమ నైపుణ్యాన్ని తెచ్చిన పాత తరాల వారు అల్లిందని ఆ పుస్తకంలోని ఓ అధ్యాయం చదివి, కార్పెట్ల బొమ్మల్ని చూసి గ్రహించాడు. స్థానిక, టర్కీ నైపుణ్యాల కలయికతో అల్లిన ఆ కార్పెట్ బొమ్మ కింది వివరణని బట్టి అది ప్రేయర్ కార్పెట్‌గా గుర్తించాడు.

ఎడ్గర్ మేనమామ రస్సెల్ మర్నాడు దినపత్రిక చదివాక ఎడ్గర్‌తో చెప్పాడు.

"ఎడ్గర్! మనకి ఎన్ని కార్పెట్లు వచ్చాయో చూడు. పేపర్లో ఆ రెండు ఇళ్ళనించి పన్నెండు రగ్గులు మాత్రమే పోయాయని రాసారు. మనం పదమూడు కొన్నామని గుర్తు."

ఎడ్గర్ వెళ్ళి లెక్కపెడితే పదమూడు ఉన్నాయి. దినపత్రికలో ఇచ్చిన కార్పెట్ వివరాల్లో రేయర్ కార్పెట్ గురించిన వివరాలు లేవు. అతనికా కార్పెట్ నచ్చడంతో చెప్పాడు.

"పన్నెండు ఉన్నాయి అంకుల్."

"ఐతే నేను తప్పు లెక్కపెట్టినట్లున్నాను. రేపు వీటిని చెక్కపెట్టెల్లో ఉంచి, ఓడలోకి ఎక్కిస్తున్నాం. దొంగతనం చేసిన దొంగలు చొరబడ్డ ఓ ఇల్లు స్టాన్లీది. అతని గురించి నీకోటి చెప్పనేలేదు కదూ? అతను దొంగ వ్యాపారాన్ని చేసేవాడు. వారింట్లోంచి దొంగలించింది కూడా దొంగ సొత్తే అవచ్చు. చెల్లుకి చెల్లు."

ఎడ్గర్ మర్నాడు పనివాళ్ళు వచ్చేలోగా ఆ కార్పెట్‌ని దొంగిలించదలచుకున్నాడు. అది శాశ్వతంగా తనది అవాలని నిశ్చయించుకున్నాడు. అరబిక్ భాషలో దానిమీద ఏం రాసుందో తెలుసుకోవాలి అనుకున్నాడు.

అతను యూనివర్సిటీలోని ఓరియెంటల్ కార్పెట్ల మీద నిపుణుడైన ఓ ప్రొఫెసర్ని కలిసి ప్రేయర్ కార్పెట్ ఫోటో చూపించి, దానిమీది అరబిక్ అక్షరాల అర్థం చెప్పమని కోరాడు. ఆయన భూతద్దంతో దాన్ని పరిశీలించాక అడిగాడు.

"ఈ కార్పెట్ ఎక్కడుంది?"

"నా మేనమామ దగ్గర."

"ఆయన దగ్గరకి ఎలా వచ్చింది?"

"మా తాత పాత కార్పెట్లని సేకరించేవాడు. ఆయన తదనంతరం నా మేనమామకు ఈ కార్పెట్ వారసత్వంగా వచ్చింది." ఎడ్గర్ అబద్ధం చెప్పాడు.

"దీన్ని గోర్వాన్ కార్పెట్ అంటారు. దీనికి చాలా కాపీలు వచ్చాయి. టాబ్రిజ్ జిల్లాలోని గోర్వాన్ ప్రాంతంలోని కార్పెట్లు అల్లేవాళ్ళు జీవించి ఉన్న గొర్రెల నించి కత్తిరించిన ఊలుని వాడతారు తప్ప మరణించిన గొర్రెల నించి తీసుకుని ఊలుని వాడరు. కాపీదారులు చవక స్విస్ రంగులని వాడేవాళ్ళు. వీటిని ఇళ్ళల్లో అలంకారంగా వాడటం కోసం నేసేవారు. ఇది గోర్వాన్ ఒరిజినలో, కాపీనో చూస్తే కానీ చెప్పలేను."

"అరబిక్‌లో ఏం రాసుంది?"

ఆయన భూతద్దం తీసుకుని చదివి చెప్పాడు.

"మొదట దీన్ని నేసిన సంవత్సరం ఉంది. 946."

"అది అసాధ్యం సర్. మీరు పొరబడి ఉంటారు. అంత పాత కార్పెట్ ఈ లోకంలో ఉంటుంది అనుకోను" ఎడ్గర్ ఖండించాడు.

"పొరపాటులేదు. ముస్లిం శకం మొహమ్మద్ మక్కానించి మదీనాకి పారిపోయిన సంవత్సరంతో ఆరంభమౌతుంది. అది మన కేలండర్ ప్రకారం క్రీ.శ 1540."

"మై గాడ్! అంటే పదహారో శతాబ్దం."

"లా ఇలాహ ఇల్లల్లాహ్ మొహమ్మదాదున్ రసులే ఇల్లా."

"అంటే?"

"అంటే ఒక్కడే దేవుడు ఉన్నాడు. మొహమ్మద్ దేవుడి దూత. మీ అంకుల్ దగ్గర ఉన్నది ప్రేయర్ కార్పెట్ కాపీ అనుకుంటాను."

"కాని అది ప్రేయర్ కార్పెట్ కన్నా పెద్దది."

"ఐతే మసీదు కార్పెటై ఉండాలి. ఏ రంగులో ఉందది?"

"ఆకుపచ్చరంగులో."

"ఐతే ఖచ్చితంగా అది మసీదు కార్పెట్టే."

"ఎలా చెప్పగలరు?"

"మహమ్మద్ జెండా రంగు ఆకుపచ్చ. మా ముత్తాత ఉత్తర ఇరాన్ నించి అమెరికాకి వలస వచ్చాడు. అప్పటి పర్షియానించి. మా ముత్తాత తన తాతల నించి విన్న ఓ కథని నాకోసారి మా నాన్న చెప్పారు. కొన్ని వందల ఏళ్ళ క్రితం ఓ మసీదు నించి ఓ ఆకుపచ్చ గోర్వాన్ కార్పెట్‌ని ఎవరో దొంగిలించారు. త్వరలో ఆ దొంగ చంపబడ్డాడు. ఆ కార్పెట్ వాడిని చంపింది. మసీదు తిరిగి దాన్ని స్వాధీనం చేసుకునేలోగా మరో దొంగ దాన్ని దొంగిలించాడు. అతన్ని కూడా ఆ పవిత్ర కార్పెట్ చంపేసింది. అది ఇప్పుడు ఎక్కడ ఉందో ఎవరికీ తెలీదు కాని దాన్ని దొంగిలించన వాళ్ళని ఆ కార్పెట్ చంపుతుందని ప్రతీతి."

"ఆ మసీదు ఎక్కడ ఉంది?"

"గోర్వాన్ అనే చోట. మా తాత పుట్టి పద్నాలుగో ఏడూదాకా పెరిగిన ఊరది. కాని నీ కార్పెట్ కాపీ అవచ్చు. అంత పాత కార్పెట్ విలువ ఇప్పుడు కనీసం పదిహేను ఇరవై లక్షల డాలర్ల విలువ చేస్తుంది" ప్రొఫెసర్ చెప్పాడు.

ఎడ్గర్ ఓరియెంటల్ కార్పెట్ల మీద పుస్తకాలని తీసుకున్న లైబ్రరీనించే ఇన్సూరెన్స్ డిటెక్టివ్ హెన్రీ కూడా దొంగిలించబడ్డ కార్పెట్లు నకిలీవని ఋజువు చేయడానికి ఆధారాల కోసం వెదకాలని పుస్తకాలని తీసుకున్నాడు. అతని ప్రశ్న విని లైబ్రేరియన్ నవ్వి చెప్పింది.

"మీరే కాదు. మరొకరు కూడా వీటిని తీసుకున్నారు."

"ఎవరు?" ఆసక్తిగా అడిగాడు.

"ఎడ్గర్ అని ఓ పాతికేళ్ళ కుర్రాడు."

దొంగిలించబడ్డ కార్పెట్ ఫోటోలని చూపించి అడిగాడు.

"ఈ అరబిక్ అక్షరాలని ఇంగ్లీష్‌లోకి తర్జుమా చేసే ఎవరైనా మీకు తెలుసా?"

ఆమె ఎడ్గర్ వెళ్ళిన ప్రొఫెసర్ పేరు చెప్పింది.

"షికాగో మొత్తానికి ఈ విషయంలో ఆద్యనే అథారిటీ. తరచు మా లైబ్రరీకి వచ్చి ఇప్పుడు మీరు తీసుకున్నలాంటి పుస్తకాలని తీసుకుంటూంటారు. ఆయనకి ఇరాన్, పర్షియా, టర్కీ, ఈజిప్ట్‌లకి చెందిన కార్పెట్ల గురించిన సమాచార దాహం బాగా ఉంది."

"ఎడ్రస్?"

"మా లైబ్రరి నియమాల ప్రకారం నేనది చెప్పకూడదు. షికాగో యూనివర్సిటీలో ఆయన పని చేస్తున్నారని మాత్రం చెప్పగలను."

"థాంక్స్" హెన్రీ చెప్పాడు.

ఆ రాత్రి హెన్రీ ప్రొఫెసర్ని కనుక్కుని ఆయన ఇంటికి వెళ్ళాడు. హెన్రీ ఇచ్చిన ఆ ఫోటోని చూసి ఆయన చెప్పాడు.

"తమాషా. ఈ ఫోటోతో నా దగ్గరకి వచ్చి ఈదే ప్రశ్న అడిగే రెండో వ్యక్తి మీరు."

"ఇంకొకరా? ఎడ్గరై ఉంటాడా?"

"అవును. అతను మీకు తెలుసా?"

"తెలీదు. అతనికి మీరేం చెప్పారో దయచేసి అవన్నీ నాకు చెప్తారా?" హెన్రీ అర్థించాడు.

పావుగంట తర్వాత బయటకి వచ్చిన హెన్రీకి దొంగిలించబడ్డ కార్పెట్లు ఎక్కడ ఉన్నాయో అర్థమైంది. షికాగోలో పాత కార్పెట్లని కొని అమ్మేది ఒక్క ఎడ్గర్ మేనమామేనని హెన్రీకి వృత్తి రీత్యా తెలుసు.

హెన్రీ సరాసరి ఆయన షాప్‌కి వెళ్ళాడు. షాప్ బయట వేన్ ఆగి ఉంది. ఇంజన్ ఆడుతోంది. తలుపు తెరచుకుని లోపలకి వెళ్ళాడు. షాప్‌లో ఎవరూ లేరు. లోపల హాల్లో మెట్లకింద ఉన్న విశాలమైఅన్ ఆకుపచ్చటి కార్పెట్‌ని చూసి నివ్వెరపోయాడు. అత్యంత ఆకర్షణీయమైన ఆ ఆకుపచ్చ ఖార్పెట్ మడతల్లోంచి రెండు నిశ్చలమైన కాళ్ళు బయటకి కనిపిస్తున్నాయి.

గబగబా బరువైన ఆ కార్పెట్‌ని అతి కష్టం మీద పక్కకి జరిపి, కింద ఉన్న పాతికేళ్ళ యువకుడ్ని చూసి అతను ఎడ్గర్ అనుకున్నాడు. అతని మరణం కాకతాళీయమా? లేక ఇందాక ఆ ప్రొఫెసర్ చెప్పినట్లు ఆ మసీదు కార్పెట్ ఎడ్గర్ని చంపిందా? తన మేనమామకి తెలీకుండా బయట వేన్‌లోకి దొంగతనంగా ఎక్కిస్తూండగా ఇది జరిగిందా?

హెన్రీ అది ఇంటి దొంగలపనని భావించాడు. అది మసీదు నించి దొంగిలించబడ్డ గ్రీన్ ప్రేయర్ గార్వాన్ కార్పెట్ అని హెన్రీ నమ్మాడు. ఎడ్గర్ మెట్లమీంచి అంత బరువైన కార్పెట్‌ని తెస్తూ కాలుజారిపడి, కార్పెట్ అతని మీద పడటంతో ఊపిరాడక మరణించి ఉండచ్చని అనుకున్నాడు. అది మిసెస్ స్టాన్లీ ఇన్సూర్ చేయని తొమ్మిదో కార్పెట్ అనుకున్నాడు.

అతనికి రెండు ఆలోచనలు కలిగాయి. నకిలీదైతే దాన్ని తీసుకెళ్ళి మిసెస్ స్టాన్లీకి తిరిగి అమ్మచ్చు. అసలుదైతే ప్రైవేట్ కలెక్టర్లకో, మ్యూజియానికో లేదా ఆక్షన్ హాల్‌కో అజ్ఞాత అమ్మకందారుడిగా అమ్మచ్చు. అతనికి ఉత్సాహ కలిగింది. జాగ్రత్తగా ఆ కార్పెట్‌ని మడిచి, అతి కష్టం మీద దొర్లించుకుంటూ బయటకి తీసుకెళ్ళి, సిద్ధంగా ఉన్న వేన్‌లోకి ఎక్కించాడు. తర్వాత పోలీసులకి ఫోన్ చేసి పోయిన పన్నెండు కార్పెట్లు ఎక్కడ ఉన్నాయో అజ్ఞాతంగా సమాచారం ఇచ్చాడు.

రెండు రోజుల తర్వాత ఓ మహిళ నించి పోలీసులకి ఫిర్యాదు అందింది. తను ఇంటికి తిరిగి వచ్చేసరికి తన భర్త కొత్తగా ఇంటికి తెచ్చిన కార్పెట్ చుట్ట తమ మంచం మీద ఉండటం చూసానని, దాన్ని విప్పితే అందులో తన భర్త హెన్రీ శవం కనిపించిందని, ఆ కార్పెట్ మీద పడుకోవాలనిపిస్తే నేలమీదే పరుచుకుని పడుకుని ఉండచ్చని, అతను అంత బరువైన ఆ కార్పెట్‌ని ఎలా ఎత్తి మంచం మీద పెట్టగలిగాడో, అసలా పని ఎందుకు చేసాడో తనకి తెలీదని ఆ ఫిర్యాదులో ఆమె పేర్కొంది.

**(వచ్చేనెల మరోకథ)**

Post your comments